క్లుప్తంగా

గ్రంథాలయాధికారిగా బాధ్యతలు స్వీకరణ

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గాలిబాలి శాఖాగ్రంథాలయాధికారిగా ఇ.వెంకటదుర్గారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన సత్యశిరీష బదిలీపై గుంటూరులోని పట్టాభిపురం బ్రాంచికి వెళ్లారు. ఈ సందర్భంగా వెంకటదుర్గారెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. పుస్తకాలు రీడర్స్‌కు అందుబాటులో ఉండేలా చూస్తానని.. సమయ వేళలు సక్రమంగా పాటించేలా చేస్తానని చెప్పారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు సిబ్బంది పి.జేమ్స్, డి.కృష్ణమూర్తి, సైదాసాహెబ్‌లు అభినందనలు తెలిపారు.

గర్భిణులకు పోషకాహారం తప్పనిసరి

ఫిరంగిపురం: గర్భిణులకు రక్తహీనత లేకుండా ఉండాలంటే పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని వైద్యురాలు శాంతి అన్నారు. మండల కేంద్రంలోని ఫిరంగిపురం పీహెచ్‌సీలో సోమవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు ఎత్తు, బరువు, పలురకాల రక్త, మూత్రపరీక్షలు చేశారు. అనంతరం గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం గురించి వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత మజ్జిగ పంపిణీ

తాడేపల్లి రూరల్: శ్రీ గంగా భగీరథ సగర సంక్షేమ సంఘం, శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం మంగళగిరి గౌతమబుద్ధా రోడ్‌లో గల సంఘం కార్యాలయం వద్ద మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు పందేటి సాంబశివరావు మాట్లాడుతూ.. ప్రతి సోమవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమానికి తమ వంతు సహాయ సహకారాలు అందించి ప్రోత్సహిస్తున్న దాతలు, సంఘ సభ్యులకు, ట్రస్ట్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నంగళం ప్రసాద్, కర్నాటి శివ సత్యనారాయణ, గండికోట వీర రాఘవులు, అచ్చియ్య, పంచల శివన్నారాయణ, పెరుమాళ్ల సుబ్రహ్మణ్యం, నాగరాజు, మధుబాబు, రెడ్డి వీర రాఘవులు, నంద్యాల గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి పట్టణ సీఐగా వీరాస్వామి

తాడేపల్లి రూరల్: మంగళగిరి పట్టణ సీఐగా వీరాస్వామిని నియమిస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంగళగిరి పట్టణ సీఐగా ఉన్న వినోద్ కుమార్‌ను వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరాస్వామి గతంలో గుంటూరులో విధులు నిర్వహించారు. నేడు బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

దొంగతనం కేసులో యువకుడు అరెస్టు

తాడికొండ: దొంగతనం కేసులో ఓ యువకుడిని పోలీసులు అరెస్టు చేసిన సంఘటన సోమవారం మండలం పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ దొంగతనం కేసులో నిందితుడు షేక్. ముస్తాఫాను తాడికొండ గ్రామంలోని అడ్డరోడ్డు వద్ద పోలీసులు అరెస్టు చేశారు. అతడిని మంగళగిరి కోర్టులో హాజరు పరచడంతో జడ్జి రెండు వారాల పాటు జ్యుడిషియల్ కస్టడీ విధించినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

గుంటూరు రూరల్: రోడ్డు దాటుతున్న వృద్ధురాలను మితిమీరిన వేగంతో వస్తున్న క్రషర్ లారీ ఢీకొనటంతో అక్కడికక్కడే ఆమె మృతి చెందింది. ఈ సంఘటన నల్లపాడు గ్రామంలోని కాలువ సెంటర్ వద్ద సోమవారం చోటుచేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని స్తంభాలగరువుకు చెందిన మట్టుపల్లి కోటేశ్వరమ్మ(60) ఉదయం కాలువ సెంటర్‌లోని శ్రీనివాసకాలనీ వద్ద పనిపై వచ్చింది. అనంతరం రోడ్డును దాటుతుండగా పేరేచర్ల నుంచి వస్తున్న లారీ ఢీకొనటంతో ఆమె అక్కడికక్కడే ఛిద్రమై మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

పొన్నూరు: పట్టణంలోని లాడ్జిలలో బస చేసేందుకు వచ్చే వారి వద్ద ఆధార్ కార్డు ఉంటేనే అనుమతి ఇవ్వాలని.. ఎలాంటి ఐడీ కార్డులేని పక్షంలో గదులు అద్దెకు ఇవ్వవద్దని పట్టణ సీఐ వీరా నాయక్ లాడ్జి నిర్వాహకులకు సూచించారు. సోమవారం పట్టణంలోని లాడ్జిలలో ఆయన ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. లాడ్జిల్లో ఉంటున్న వారి వివరాలను పరిశీలించారు. లాడ్జిలలో బస చేసే అపరిచిత వ్యక్తుల సమాచారం ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. లాడ్జిలలో అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతి భద్రతలను కాపాడడానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాంధ్రపై విస్తృత ప్రచారం

ఫిరంగిపురం: యోగాతోనే ఆరోగ్యం చేకూరుతోందని ఇన్‌చార్జి ఎంపీడీవో రవిబాబు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ప్రభుత్వం ప్రవేశపెట్టిన యోగాంధ్రపై విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ.. యోగ చేయడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని అన్నారు. దీనిలో అందరూ భాగస్వాములై ఆరోగ్యం కాపాడుకోవాలని చెప్పారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.ప్రసాదరావు, ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు, ఎంఈవో మహబూబ్‌సుభానీ, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

దుగ్గిరాల: యోగా ప్రాధాన్యతను వివరిస్తూ యోగాంధ్ర మాసోత్సవాలను సోమవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. యోగాపై అవగాహన ర్యాలీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో పాల్గొన్న గ్రామ సర్పంచ్ బాణావత్ ఖుషీనాయక్ మాట్లాడుతూ.. యోగాసనాలు మన పూర్వికుల నుంచి వచ్చిన మన భారత సంప్రదాయం అని అన్నారు. ఈనెల 21న యోగా దినోత్సవం నిర్వహిస్తున్నామని.. దానిలో భాగంగా ప్రజలకు అవగాహన పెంపొందించేందుకు ర్యాలీ నిర్వహించామని తెలిపారు. యోగా ద్వారా మానసిక ఒత్తిడి, శరీరక ఆరోగ్యం నిలకడగా మన చేతుల్లో ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో, గ్రామ ఈవో, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



దుగ్గిరాల శివాలయం వద్ద యోగాంధ్ర ర్యాలీ

తాడేపల్లి రూరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి రూరల్ పరిధిలోని నవులూరు గ్రామంలో యోగాపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ గుంటూరు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు వేమూరి మైనర్ బాబు మాట్లాడుతూ.. యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. బాల్యం నుంచి యోగాను అభ్యసిస్తే ఎన్నో ఫలితాలు ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం యోగాపై అవగాహన కల్పిస్తూ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో కొత్త శ్రీనివాస్, పైలా రవి, వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్య ఘర్ పథకాన్ని వినియోగించుకోవాలి

తాడికొండ: కేంద్ర ప్రభుత్వం రాయితీపై అందించే పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకుని విద్యుత్ వినియోగాన్ని తగ్గించుకుని అదనపు ఖర్చులు లేకుండా చూసుకోవాలని ఏపీ సీఆర్‌డీఏ సర్కిల్ పర్యవేక్ష ఇంజనీర్ పి.సుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం తాడికొండ విద్యుత్ శాఖ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఎం సూర్య ఘర్ ముఫ్తీ బిజిలీ యోజన పథకం కింద ప్రభుత్వం ఒక కిలోవాట్‌కు రూ.30 వేలు, రెండు కిలో వాట్లకు రూ.60 వేలు, మూడు కిలోవాట్‌లకు రూ.78 వేలు రాయితీ ఇస్తుందన్నారు. ఈ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకుని విద్యుత్ అదనపు భారం తగ్గించుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ గుర్తింపు కార్డులు ఇవ్వాలి

పొన్నూరు: పట్టణంలోని 16, 25 వార్డులలో నివసించే యానాది కుటుంబాలకు చెందిన పిల్లలకు ఆధార్ నమోదు చేయాలని నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ కోరారు. ఈ సందర్భంగా సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు మాట్లాడుతూ.. జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి పని చేసే యానాది కుటుంబాల పిల్లలకు జనన ధృవపత్రం లేకపోవడంతో ఆధార్ కార్డులు మంజూరు కావడంలేదని తెలిపారు. దీంతో రేషన్ కార్డులో పిల్లల పేర్లు లేని కారణంగా రేషన్, సంక్షేమ పథకాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. భర్త మరణ ధృవపత్రం లేకపోవడంతో వితంతువులు పెన్షన్ పొందలేని స్థితిలో ఉన్నారన్నారు. అర్హత కలిగిన వారందరికీ ఆధార్ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ప్రభుత్వ అధికారులు తక్షణం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రచయిత దేవరకొండ శ్రీనివాస్, పెద్ద బ్రహ్మయ్య, వెంకయ్య, సీతమ్మ, కోటేశ్వరమ్మ, పాపాలు, అప్పాయమ్మ, శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

జిందాల్ ఎనర్జీ ప్లాంట్ సందర్శన

గుంటూరు రూరల్: జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ని రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ సందర్శించారు. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపేటలోని జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్‌ని పరిశీలించేందుకు రానున్న తరుణంలో సోమవారం ప్రిన్సిపల్ సెక్రటరీ సీడీఎంఏ డాక్టర్ సంపత్‌కుమార్, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి ప్లాంట్‌ని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్లాంట్ సామర్థ్యం, పనితీరు, అవసరమైన వ్యర్థాలు, ఏ మున్సిపాల్టీల నుంచి ఎంత చెత్త వస్తుంది.. ఎంత విద్యుత్ ఉత్పత్తి అవుతుంది తదితర వివరాలను జిందాల్ ఏపీ ప్రాజెక్ట్ ప్రెసిడెంట్ ఎంవీ చారీ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. పర్యటనలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, ఉపా సెల్ పీఓ రామారావు తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న సురేష్‌కుమార్

రేపు తెనాలిలో సాహిత్య బాటసారి శారద పుస్తకావిష్కరణ

తెనాలిఅర్బన్: అభ్యుదయ రచయితల సంఘం, గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక జిల్లా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన సాహిత్య బాటసారి– శారద స్మృతి శకలాలు పుస్తకాన్ని తెనాలిలో ఆవిష్కరించనున్నట్లు అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావులు తెలిపారు. బుధవారం ఉదయం 10.30గంటలకు ఏఎస్ఎన్ కళాశాలలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగే కార్యక్రమానికి వివేక విద్యాసంస్థల డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ అధ్యక్షత వహించనున్నట్లు చెప్పారు. అరసం జాతీయ అధ్యక్షుడు, కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు వివరించారు.

అలాగే కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పాపినేని శివశంకర్ ముఖ్యఅతిథిగా, మానవత తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ విశిష్ట అతిథిగా పాల్గొంటారన్నారు. 1985లో అలూరి భుజంగరావు రచించిన పుస్తకాన్ని తెనాలి ఇంప్రెషన్స్ వారు పునఃముద్రణ చేసినట్లు పేర్కొన్నారు. నటరాజన్ శారద మద్రాస్ నుంచి తెనాలి వచ్చి హోటల్ కార్మికునిగా పనిచేస్తూ తెలుగు నేర్చుకుని ప్రసిద్ధ రచయితగా ఎదిగారని గుర్తు చేశారు.

నటరాజన్ శారద జీవిత విశేషాలు

తెలుగు సాహితీ ప్రపంచంలో శారదనే కలం పేరుతో సుప్రసిద్ధులైన రచయిత నటరాజన్ శారద ఆయన అసలు ఎస్.నటరాజన్ 1924లో తమిళనాడులోని పుదుక్కోటలో సుబ్రహ్మణ్య అయ్యర్, భాగీరథి దంపతులకు జన్మించారు. 2వ ఏటనే తల్లిని కోల్పోవడంతో తన సోదరిల వివాహాల కారణంగా తండ్రితో కలిసి ఆయన 1937లో తెనాలి వచ్చారు. చిన్న వయస్సులోనే ప్రాచీన ఆధునిక తమిళ సాహిత్యాన్ని ఆకళింపు చేసుకున్నారు. తురగా వెంకటేశ్వరరావు అనే ఉపాధ్యాయుని వద్ద తెలుగు ఓనమాలు నేర్చుకుని, 1948 నుంచి 1950 వరకు రచనలు చేశారు. ప్రపంచానికి జబ్బు చేసింది అనేది తొలి వ్యంగ రచయిన, ప్రజావాణి, చంద్రిక అనే పత్రికలను ప్రారంభించి సంపాదకునిగా వ్యవహించారు. ఏది సత్యం, మంచి చెడు, అపస్వరాలు, చీకటి తెరలు, మహీపతి, అందాల దీవి, చదరంగం, సందేశం, నాగరీకుని ప్రేమ, కార్యదర్శి, హోటల్లో శవం వంటి ప్రసిద్ధి కథలు రచించారు. పేద మధ్యతరగతి ప్రజల జీవితాలు, వాటి కష్టాలు, మానసిక సంఘర్షణలు ఆయన రచనల్లో స్పష్టంగా కనిపిస్తాయి. నటరాజన్ శారద 1955 ఆగస్టు 17న మూర్ఛ వ్యాధితో మరణించారు.


సాహిత్య బాటసారి- శారద పుస్తకం

నూతన రహదారులు నిర్మించండి

తెనాలిఅర్బన్: 12,38 వార్డుల్లో నూతన రోడ్లు నిర్మించాలని ఆ ప్రాంతవాసులు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నను కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. 19వ వార్డులో చెట్లు కొట్టి వేయాలని, 33వ వార్డులోని కాల్వల్లో పూడిక తీత పనులు చేయాలని, 6వ వార్డులో గార్బేజ్ పాయింట్‌ను తొలగించాలని పలువురు అర్జీలు ఇచ్చారు. వీటన్నింటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, ఏఈ సూరిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గుమ్మడి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్ శేషన్నకు అర్జీ అందజేస్తున్న వృద్ధుడు

ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల ధర్నా



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న ధర్నా సోమవారంతో 188వ రోజుకు చేరుకుంది. దీక్షా శిబిరాన్ని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావాల్సిన బకాయిల కోసం ధర్నా నిర్వహిస్తున్నా ప్రభుత్వంలో స్పందన కనిపించడం లేదని అన్నారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, ఎం.ఆశీర్వాదం, సాంబయ్య, నాగేశ్వరరావు, దుర్గాభవాని, ఇమాంబి, సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానంలో మొక్కలు నాటే కార్యక్రమం

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం బైపాస్ రోడ్ సమీపాన ఉన్న శ్రీ అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వరస్వామి వారి దేవస్థానం కాశీనాయన ఆశ్రమంలో సోమవారం బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. మంగళగిరి పార్టీ అసెంబ్లీ కన్వీనర్ పంచుమర్తి ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలనకు గుర్తుగా మొక్కలు నాటామని తెలిపారు. గుంటూరు జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు తుల్లిమిల్లి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు డాక్టర్ మునగపాటి వెంకటేశ్వరరావు, తాడేపల్లి పట్టణ ఉపాధ్యక్షులు గట్ల శివకొండారెడ్డి, ప్రధాన కార్యదర్శి వల్లూరు శివరామకృష్ణ, యువ మోర్చా అధ్యక్షులు బత్తుల ఆంజనేయులు, మంగళగిరి పట్టణ పార్టీ మాజీ అధ్యక్షులు కాంద్రు భాను కిషోర్, కొతరపు ధనుంజయ, కార్యకర్తలు బిక్షపతి, సుబ్బారావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో విద్యార్థినుల ప్రతిభ

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పనే లక్ష్యంగా తమ కళాశాల కృషి చేస్తుందని సెయింట్‌ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపల్ రెవరెండ్ సిస్టర్ టి.సంధ్య తెలిపారు. సోమవారం గోరంట్ల గ్రామంలోని కళాశాలలో హైదరాబాదుకు చెందిన టీసీఎస్ సంస్థ ప్రాంగణ ఎంపికలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రాంగణ ఎంపికల్లో కళాశాలకుచెందిన 7మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఉద్యోగాలను పొందిన విద్యార్థినులను కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ జె.ప్రతాప్ రెడ్డి, తదితరులు అభినందించారు.

మునిసిపల్ కమిషనర్ బదిలీ

తెనాలి అర్బన్: పట్టణ మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న బదిలీ అయ్యారు. ఈ మేరకు మునిసిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఆయనను నంద్యాల మునిసిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. గుంటూరు కార్పొరేషన్‌లో అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న సి.ఓబులేసును తెనాలి మునిసిపల్ కమిషనర్‌గా నియమించారు.

జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో గణేష్ జట్టు విజయం

రేపల్లె: జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ టీమ్ క్రీడాకారులు ప్రతిభ చాటారు. గత 10 రోజుల నుంచి దూళిపూడిలో జరిగిన ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు సోమవారంతో ముగిశాయి. టోర్నమెంట్‌లో పాల్గొన్న చెరుకుపల్లి మండలం రాజోలుకు చెందిన రామకృష్ణారెడ్డి నేతృత్వంలోని డాక్టర్ ఈవూరు గణేష్ టీమ్ ప్రతిభ చాటి విన్నర్‌గా నిలిచింది. ఇటీవల కృష్ణాజిల్లా ఘంటసాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో, కొల్లూరులో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో రామకృష్ణారెడ్డి టీమ్ ప్రథమ స్థానంలో నిలిచింది.


ట్రోఫీతో రామకృష్ణారెడ్డి, టీం సభ్యులు

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలి

తాడేపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రైతులు, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం అందజేయాలని ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు కోరారు. సోమవారం మంగళగిరి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ దినేష్ రాఘవేంద్రరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, రైతు సంఘం నాయకులు జవ్వాది సాంబశివరావు, ఆళ్ల రామిరెడ్డి, నాసరయ్య, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విద్యుత్ అధికారుల తనిఖీలు

తాడికొండ: తాడికొండ మండల పరిధిలో సోమవారం విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో 40 బృందాలుగా అధికారులు, సిబ్బంది కలిసి తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో 27 కేసులు అధిక లోడు, 4 కేసులు విద్యుత్ చౌర్యం, 5 కేసులు కేటగిరి–1 నుంచి 2కి వినియోగించిన కేసులు గుర్తించి రూ. 2.60 లక్షల అపరాధ రుసుము విధించినట్లు సీఆర్‌డీఏ సర్కిల్ పర్యవేక్ష ఇంజనీర్ పి.సుబ్రహ్మణ్యం తెలిపారు. తాడికొండ విద్యుత్ శాఖ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ చౌర్యం చట్ట రీత్యా నేరమని.. అధిక లోడు వినియోగిస్తున్న వారు వెంటనే కేటగిరి–2 కిందకు మార్చుకుని సంబంధిత ఛార్జీలు చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, అమరావతి ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె.సంజీవరావు, మంగళగిరి డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.సురేష్‌బాబు, తాడికొండ ఆపరేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఎన్.నాగమల్లేశ్వరరావు, పలువురు విద్యుత్ శాఖ అధికారులు, ఏఈలు, డీఈలు పాల్గొన్నారు.

కొరిటిపాడు(గుంటూరు): విద్యుత్ శాఖ విజిలెన్స్, సీఆర్‌డీఏ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో తాడికొండ సెక్షన్ పరిధిలోని మోతడక, మెక్కామల, పొన్నెకల్లు, పెద కండ్రిక, పాములపాడు, ఫణిదం, రావెలలలో సోమవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 45 మంది అధికారులు, 195 మంది సిబ్బంది 45 బృందాలుగా ఏర్పడి 3,106 సర్వీసులను తనిఖీలు చేశారు. అదనంగా విద్యుత్ వాడుతున్న 27 మందికి రూ.1.26 లక్షలు, మీటరు ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న నలుగురికి రూ.90 వేలు, అనుమతించిన కేటగిరి కాక ఇతర కేటగిరిలో విద్యుత్ వాడుకుంటున్న 5 మందికి రూ.1.40 లక్షలు, అసలైన వాడకం కంటే బిల్లు తక్కువగా ఇవ్వబడిన ఒకరికి రూ.5 వేలు మొత్తం కలిపి రూ.3.61 లక్షలు అపరాధ రుసుం విధించినట్లు విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ వెంకటేశ్వరరావు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్‌ను వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తనిఖీల్లో సీఆర్‌డీఏ సర్కిల్ ఆపరేషన్ పర్యవేక్షక ఇంజనీర్ పి.సుబ్రమణ్యం, అధికారులు జె.సంజీవరావు, మల్లిఖార్జున ప్రసాద్, కోటేశ్వరరావు, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఏపీ సీఆర్‌డీఏ సర్కిల్ పర్యవేక్ష ఇంజనీర్ సుబ్రహ్మణ్యం

కమిషనర్‌కు వినతిపత్రం అందజేత

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్‌బాషాకు సోమవారం ఆయన కార్యాలయంలో మాజీ ఎంపీపీ మున్నంగి గోపిరెడ్డి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గోపిరెడ్డి మాట్లాడుతూ.. గతంలో మంగళగిరి పరిసర ప్రాంతాల్లో ఎన్నో చెరువులు ఉండేవని, ప్రస్తుతం అవి కనుమరుగౌతున్నాయని అన్నారు. గతేడాది వచ్చిన వరదలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం ఉన్న చెరువులను తక్షణమే పునరుద్ధరించాలని కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశామని తెలిపారు. మంగళగిరి రత్నాలచెరువు ఆక్రమణలపై అధికారులు స్పందించని పక్షంలో న్యాయస్థానంలో పోరాటం చేస్తామని ఆయన తెలిపారు.


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మున్నంగి

అర్హులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి

పెదకాకాని: ఎన్నో దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పాశం రామారావు డిమాండ్ చేశారు. పెదకాకాని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి మండల సీపీఎం కార్యదర్శి నన్నపనేని శివాజీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ.. రాష్ట్ర కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని వాగ్దానం చేసిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్న తమ వాగ్దానాన్ని నిలబెట్టుకోలేదన్నారు. నన్నపనేని శివాజీ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న పేదలకు వెంటనే ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని.. లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని అన్నారు. అనంతరం తహసీల్దార్ పి.కృష్ణకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరలో ఇళ్ల పట్టాలను అందిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు రాజా రమేష్, బురదగుంట సాంబయ్య, సంకూరి నీలాంబరం, ఉల్లంగుల శివయ్య, కె.సత్యనారాయణ, బి.బాబురావు, పలు కాలనీ వాసులు షేక్ హసీనా, దోసర మల్లేశ్వరి, తాత హైమావతి, ఎ.నాగేశ్వరావు, ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు పాశం రామారావు, నన్నపనేని శివాజీ

నకిలీ విత్తనాల ముఠాలను అరికట్టాలి

పెదకాకాని: ప్రభుత్వం నకిలీ విత్తనాలు విక్రయించి సొమ్ము చేసుకుంటున్న ముఠాల ఆగడాలను అరికట్టాలని రాష్ట్ర వ్యవసాయ సంఘం కార్యదర్శి కేవీవీ ప్రసాద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం పెదకాకాని మండల కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా రైతు సంఘం అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కేవీవీ మాట్లాడుతూ.. ఖరీఫ్ పంటల సీజన్ మొదలైన నేపథ్యంలో ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేసి నకిలీ విత్తనాల ముఠాల ఆగడాలను అరికట్టాలని కోరారు. కౌలు రైతు కార్డులు త్వరితగతిన ప్రతి రైతుకు అందే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సమైక్య కార్యదర్శి రెంటాల కుమారి, జిల్లా అగ్రి గోల్డ్ బాధితుల సంఘం కార్యదర్శి కేతినేని అగస్టీన్, నంబూరు గ్రామ సీపీఐ కార్యదర్శి కూసం నాగిరెడ్డి, వెనిగండ్ల సీపీఐ కార్యదర్శి షేక్ బాషీద్ తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న కేవీవీ ప్రసాద్